ప్రజాశక్తి
బుధవారం 12 ఫిబ్రవరి 2025
5
అనంతపురం

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రారంభం కాని టెక్స్‌టైల్ పార్కులను

రద్దు చేయండి

◆ కొత్తవాటి నోటిఫికేషన్ జారీకి చర్యలు

◆ కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం టెక్స్‌టైల్ పార్కుల్లో ఇంకా ప్రారంభం కాని 47 యూనిట్లను రద్దు చేస్తూ, వాటి స్థానంలో కొత్త నోటిఫికేషన్ జారీకి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం రాయదుర్గం టెక్స్‌టైల్ పార్క్‌కు సంబంధించి జిల్లాస్థాయి కమిటీ సమావేశాన్ని కలెక్టర్ ఛాంబర్ నుంచి జూమ్ వీడియోకాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. కలెక్టర్ బంగ్లా నుంచి కలెక్టర్ పాల్గొనగా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసరెడ్డి, కళ్యాణ దుర్గం ఆర్డీవో వసంత బాబు, ఏపిఐఐసి జోనల్ మేనేజర్ సుహానా సోనీ, కమిటీ మెంబర్లు ప్రసాద్, ఇబ్రహీం, రాయదుర్గం తహశీల్దార్ నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాయదుర్గం టెక్స్‌టైల్ పార్కులో వీధి దీపాలు వెలిగేలా పంచాయతీ అధికారులు చూడాలన్నారు. రాయదుర్గంలో అరవింద్ కంపెనీ యూనిట్‌ను నెలకొల్పేందుకు కోరుతున్న భూమిని పార్కు లేదా రాయదుర్గంలో ఏపీఐఐసి వద్ద ఉన్న భూముల నుంచి కేటాయించాలన్నారు. అనంతరం కమిటీలో పలు అంశాలపై తీర్మానాలు చేశారు.

దళితుల భూమి 6.51 శాతమే..!

◆ సన్న, చిన్నకారు రైతులే అధికం ◆ అగ్రికల్చర్ సెన్సెస్ సర్వేలో తేలిన లెక్కలు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సమాజంలో అణగారిన వర్గాలైన దళితులు, గిరిజనుల వద్ద నామ మాత్రపు భూమే ఉంది. ఇతర సామాజిక తరగతుల వద్దనే ఎక్కువ భూమి ఉన్నట్టు ఇటీవల జరిగిన అగ్రికల్చర్ సర్వే ద్వారా స్పష్టమవుతోంది. ఐదేళ్లకు ఒకసారి దేశ వ్యాప్తంగా ఈ అగ్రికల్చర్ ల్యాండ్ హోల్డింగ్ గణాంకాలను భారత ప్రభుత్వం తీస్తుంది. ఇందులో భాగంగా 2021-22కు సంబంధించి ఇప్పుడు జిల్లాలోనూ అగ్రికల్చర్ సెన్సెస్ జరిగింది. ఇంకా పూర్తిస్థాయి సర్వే వెల్లడి అవ్వాల్సి ఉన్నప్పటికీ ప్రొవిజనల్ గణాంకాలను వచ్చేయి. దీని ప్రకారం చూస్తే అనంతపురం జిల్లాలో దళితుల వద్దనున్న భూమి 6.51 శాతం మాత్రమే ఉంది. ఇక గిరిజనుల వద్ద 2.2 శాతం భూమి ఉంది. తక్కిన భూమి అంతా ఇతర సామాజిక తరగతుల వద్దనే ఉంది.

గణాంకాలు ఇలా..!

అనంతపురం జిల్లాలో 7,41,198 హెక్టార్ల సాగుభూమి ఉంది. ఇందులో 4,58,044 మంది రైతుల చేతుల్లో ఉంది. ఈ మొత్తం భూమిలో 40,974 మంది దళితులకు 48,288 హెక్టార్ల భూమి ఉంది. మొత్తం జిల్లాలో ఉన్న సాగుభూమిలో లెక్కేసినప్పుడు అది 6.51 శాతం ఉంది. సగటున ఒక్కొక్కరు 1.17 హెక్టార్ల వరకు మాత్రమే భూమి కలిగున్నారు. 11,692 మంది గిరిజనుల చేతుల్లో 16,822 హెక్టార్ల భూమి ఉంది. 2.2 శాతం భూమి కలిగిన్నారు. ఇతర సామాజిక తరగతులకు సంబంధించి 4,05,331 మంది రైతుల వద్ద 6,75,732 హెక్టార్ల భూమి ఉంది. 47 సంస్థల వద్ద 356 హెక్టార్ల భూమి ఉంది.

చిన్న, సన్నకారు రైతులే అధికం

అనంతపురం జిల్లాలో మొత్తం 74,119 హెక్టార్ల సాగు భూమి ఉంది. ఇందులో చిన్నసన్నకారు రైతులే అధికంగానున్నారు. ఒక ఎకరంలోపు భూమి కలిగున్న వారు 1,66,489 మంది రైతులు 97,434 హెక్టార్ల భూమిని కలిగున్నారు. రెండు హెక్టార్లలోపు భూమి 1,68,309 మంది వద్ద ఉన్నారు. వీరి చేతుల్లో 2,45,570 హెక్టార్లు ఉంది. నాలుగు హెక్టార్లలోపు 1,02,776 మంది రైతులు 2,58,914 హెక్టార్ల కలిగున్నారు. పది ఎకరాల్లోపు కలిగున్నవారు 1,02,776 మంది ఉన్నారు. వీరి పరిధిలో 2,58,914 హెక్టార్ల భూమి ఉంది. పది ఎకరాల్లోపు కలిగున్నవారు 18,686 మంది రైతులున్నారు. వీరి చేతిలో 1,03,214 హెక్టార్ల భూమి ఉంది. పది ఎకరాలపైన భూమి కలిగిన రైతులు 1784 మంది ఉన్నారు. వీరి చేతుల్లో 1,03,214 హెక్టార్ల భూమి ఉంది. మొత్తంగా 70 శాతం వరకు చిన్నసన్నకారు రైతులే ఉన్నారు. పూర్తి స్థాయి సమాచారం వెల్లడయ్యాక అంతకు ముందు ఇప్పటికే ల్యాండ్ హోల్డింగ్ ఏ రకంగా ఉందన్నది స్పష్టమయ్యే అవకాశముంది.

జొన్నను కొనుగోలు చేయండి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



వినతిపత్రం అందజేస్తున్న రైతు, కౌలు రైతుసంఘం నాయకులు

గిట్టుబాటు ధర కల్పించి రైతుల వద్ద ఉన్న సీడ్ జొన్న పంటను ప్రభుత్వం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతు, కౌలురైతుసంఘం నాయకులు కోరారు. ఈ మేరకు జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఏవో బాలు నాయక్‌కు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్ రెడ్డి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.బాల రంగయ్య, రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.హెచ్.రాయుడు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విడపనకల్ మండలం హావళిగి గ్రామంలో సీడ్ జొన్న గత 30 సంవత్సరాలుగా రైతులు సాగు చేస్తున్నారన్నారు. కంపెనీలు దళారుల ద్వారా విత్తనాలు రైతులకు ఇచ్చి తిరిగి రైతుల దగ్గర నుంచి దళారుల ద్వారా పంటను కొనేవారన్నారు. ప్రస్తుతం కొనేవారు రాక రైతుల ఆందోళన చెందుతున్నారన్నారు. హావళిగి గ్రామంలోని సుమారు 2000 ఎకరాలకు పైగా పంట సాగు చేశారని, 3000 క్వింటాళ్ల రైతుల దగ్గర పంట నిల్వ ఉందన్నారు. నెల రోజుల ముందు క్వింటా రూ.4వేల నుంచి రూ.4500 ఉన్న ధర ఉన్న ఫళంగా కొనే వ్యాపారులకు పడిపోయిందన్నారు. పండిన పంట కొనేవారు లేక, గిట్టుబాటు ధర లేక ఇటీవల ఆ గ్రామానికి చెందిన ఒక రైతు ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం, అధికారులు జోక్యం చేసుకుని రైతుల దగ్గర ఉన్న సీడ్ జొన్నను గిట్టుబాటు ధరకు కొనేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పంట విక్రయంలో దళారుల బెడదనూ నియంత్రించాలన్నారు.

అంతర్జాతీయ యునాని దినోత్సవం

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

నగరంలోని నాలుగో రోడ్డులో ఉన్న ఆయుష్ ప్రభుత్వ యునాని వైద్యశాలలో 9వ అంతర్జాతీయ యునాని దినోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. యునాని వైద్యాధికారి డాక్టర్ రఫీ ఆధ్వర్యం నిర్వహించిన కార్యక్రమంలో ఆయుర్వేద ఇన్‌ఛార్జి సీనియర్ వైద్యాధికారి, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ రామకుమార్, మోమియో సీనియర్ వైద్యాధికారి డాక్టర్ లాల్య నాయక్ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ సిబ్బంది సుదర్శన్, మహేంద్ర బాబు, సుధాకర్, శ్రీనివాసులు, ఆయుష్ యోగ శిక్షకులు గురురాజా, కృష్ణవేణి పాల్గొన్నారు.

లక్ష్యం ఉన్నతంగా ఉండాలి

ప్రజాశక్తి-అనంతపురం

లక్ష్యాలు ఉన్నతంగా ఉన్నపుడే అభివృద్ధి సాధించగలమని భవిష్యత్ ఫౌండేషన్ సిఇఒ గుంటూరు విజయ్ కృష్ణ పేర్కొన్నారు. అనంతపురం ప్రభుత్వ బాలుర ఐటిఐలో బుధవారం ఉదయం నిర్వహించిన "స్కిల్ హవర్" కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్ధేంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భవిష్యత్ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ రామాంజనేయులు, ప్రిన్సిపాల్ రామమూర్తి, ఐటిఐ ప్రిన్సిపాల్ నందకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ

లేఅవుట్ల అభివృద్ధిపై సమీక్ష

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అహుడా పరిధిలోని అనంతపురం, కూడేరు, ధర్మవరంలలో వెసిన లేఅవుట్ల అభివృద్ధిపై మంగళవారం స్థానిక అహుడా కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అహుడా ఛైర్మన్ టిసి వరుణ్, జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ మాట్లాడుతూ లే అవుట్లలో ఆహ్లాద వాతావరణంలో మెరుగైన వసతులు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఎస్ఒ రామ్మోహన్‌రెడ్డి ప్లానింగ్ ఆఫీసర్ మహమ్మద్ ఇషాక్, కార్యదర్శి గౌరీశంకర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దుష్యంత్, జూనియర్ ప్లానింగ్ ఆఫీసర్ హరీష్‌చౌదరి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రేవంత్‌కుమార్‌రెడ్డి, సరస్వతి పాల్గొన్నారు.

త్వరలో అర్హులందరికీ ఇళ్ల పట్టాలు

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

త్వరలోనే నగరంలోని అర్హులందరికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేసేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. 'మీ ఇంటికి-మీ ఎమ్మెల్యే' కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాజీవ్‌కాలనీ పంచాయతీలో ఇంటింటికీ వెళ్లి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇళ్లస్థలాలు, డ్రెయినేజీ, వీధిలైట్లు వంటి సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యుత్ సమస్యలకు వెంటనే పరిష్కారం చూపించాలని అధికారులను ఆదేశించారు. త్వరలోనే అర్హులందరికీ ఇళ్లపట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో ఒక్క ఇల్లు కూడా కట్టివ్వలేదన్నారు. కనీసం డ్రెయినేజీ సమస్యలు పరిష్కరించలేదన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి కనిపిస్తోందన్నారు. గత ఐదేళ్లలో జగన్ పంచాయతీ రాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.1,450 కోట్ల నిధులు గ్రామ పంచాయతీల అభివృద్ధికి కేటాయించామన్నారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారాలోకేష్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ పంచాయతీలకు పూర్వ వైభవం తెచ్చామన్నారు. రాజీవ్‌కాలనీలోని సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వినతిపత్రం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

10 నిమిషాల్లో 'పాట' సమాప్తం..!

◆ నామమాత్రంగా సంత మార్కెట్ వేలంపాట

◆ సర్కారు సవాలుకు రూ.15 వేలే అదనం

◆ అధికారుల తీరుతో కార్పొరేషన్ ఆదాయానికి గండి

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

దినసరి, ఇతరత్రా మార్కెట్ల వేలం పాట ద్వారా కార్పొరేషన్‌కు ఆదాయం సమకూర్చుకోవాల్సిన అధికారులే దాని నిర్వహణ చాలా తేలిగ్గా తీసుకున్నారు. కార్పొరేషన్ ఆదాయం కంటే వేలం నిర్వహణను మమ అనిపించి ముగించేందుకే అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లుందనే వాదన బలంగా విన్పిస్తోంది. మంగళవారం ఉదయం కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ బాలస్వామి, డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వేలం పాటను నిర్వహించారు. ఈకార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్లు విజయకుమార్, లక్ష్మీదేవి, ఆర్ఐలు పాల్గొన్నారు. మూడు సంవత్సరాల దినసరి సంత మార్కెట్ వేలంపాట సరాసరితో సర్కారు సవాలును రూ.88 లక్షలుగా నిర్ధారించారు. కాంట్రాక్టర్ అభిలాష్ రూ.5వేలు తన పాటగా పాడారు. రెండో కాంట్రాక్టర్ విజయకుమార్ తన పాటగా రూ.10వేలు పాడారు. అటు తర్వాత అభిలాష్ రూ.15వేలు అన్నాడు. ఈయన ఇలా అనగానే అధికారులు మళ్లీ పాడేందుకు కనీస సమయం ఇవ్వకుండా ఒకటోసారి, రెండోసారి, మూడోసారి అంటూ అభిలాష్‌కు పాట ఖాయం చేస్తున్నట్లు ప్రకటించారు. కాంట్రాక్టర్ విజయ్ కుమార్ గత మూడేళ్లుగా టెండర్ దక్కించుకోవడంలో అందరికన్నా ముందున్నారు. ఈసారిమాత్రం ఆయన ఒకసారి పాట పాడి తర్వాత మిన్నకుండిపోయారు. దీన్ని బట్టి చూస్తే వేలంపాట కన్నా ముందే బయట కాంట్రాక్టర్లు కుమ్మక్కయ్యారా..? లేక అధికారులే అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గా వేలం పాటను నామమాత్రంగా నిర్వహించారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దినసరి సంత మార్కెట్ వేలంపాటను కేవలం 10 నిమిషాల వ్యవధిలోనే అధికారులు ముగించారు. గడచిన 30 ఏళ్ల కాలంలో ఏనాడూ దినసరి సంత మార్కెట్ వేలంపాట పది నిమిషాల వ్యవధిలో ముగియలేదు. ఇదంతా కాంట్రాక్టర్లు, అధికార పార్టీ నేతలకు మేలు చేసేందుకు అధికారులు కావాలనే చేశారా.. లేక మరేదైనా కారణం ఉందానే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

రూ.15వేలే అదనం..!

ఈ నెల 4వ తేదీన జరిగిన వేలంపాటలో గతంలో ఎన్నడూ లేని విధంగా మటన్ మార్కెట్ వేలం పాటలో గతం కన్నా రూ.2 లక్షలు అధికంగా కార్పొరేషన్‌కు వచ్చింది. ఆరోజు దాదాపు 45 నిమిషాల పాట సంతమార్కెట్ వేలంను నిర్వహించారు. గత సమస్యలు, సుంకం వసూలుపై చర్చల నేపథ్యంలో అధికారులు వేలం పాటను ఉన్న ఫలంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. మంగళవారం నిర్వహించిన సంత మార్కెట్ వేలం పాటను మాత్రం 10 నిమిషాల వ్యవధిలో ముగించడం విశేషం. సర్కార్ సవాలు కన్నా కేవలం రూ.15 వేలు మాత్రమే అదనంగా పాట పాడి మార్కెట్‌ను వేలంలో దక్కించుకున్నారు. సంత మార్కెట్ వేలం ద్వారా ఈ సారి కార్పొరేషన్ ఖజానాకు పెద్ద మొత్తంలో డబ్బులు వస్తాయన్న ఆశలు నీరుగారాయి.

వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

వేలం పాటలో అనుచరవర్గం..!

వేలంపాటలో పాల్గొనే కాంట్రాక్టర్లకు మాత్రమే పాట నిర్వహించే కేంద్రంలోకి అనుమతించాల్సి ఉంది. ఆ నిబంధనలను అధికార పాలకవర్గం బేఖాతార్ చేసింది. వేలంపాటలో పాల్గొన్న ఇద్దరు కాంట్రాక్టర్ల అనుచర వర్గం కూడా వేలంపాట జరిగే ప్రాంతంలోనే కూర్చొన్నారు. ఇక గత మూడేళ్లుగా దినసరి సంత మార్కెట్ వేలం పాట టెండర్ దక్కించుకుంటున్న విజయకుమార్ సుంకం వసూలులో ఎదురవుతున్న ఇబ్బందులను అధికారుల వద్ద ప్రస్తావన చేసే ప్రయత్నం చేశారు. కమిషనర్ బాలస్వామి అడ్డు చెబుతూ వేలంపాట జరిగే సమయంలో సమస్యల ప్రస్తావన వద్దని వారించారు. సమస్యలు ఉంటే వేలంపాట జరగటానికి ముందు రోజు గానీ, తర్వాత రోజు గానీ వచ్చి ప్రస్తావించాలన్నారు. వేలం పాట పూర్తయిన తర్వాత సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

వ్యాపారులు, దళారులకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వం

ఊసరవెల్లి సిగ్గుపడేలా సిఎం చంద్రబాబు తీరు-వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

ఆరుగాలం శ్రమించి రైతన్న పండించిన పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర ఇవ్వకుండా వ్యాపారులు, దళారులకు కొమ్ముకాస్తోందని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మండిపడ్డారు. మంగళవారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాగు చేసిన ఏ పంటకూ గిట్టుబాటు ధరలేక రైతులు ఇబ్బందులు పండుతుంటే ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న ప్రజాప్రతినిధులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం బాధాకరమన్నారు. ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుని అధికారంలోకి వచ్చాక మాటలకే పరిమితం అవుతున్నారని విమర్శించారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు నిత్యం గత ప్రభుత్వం, మాజీ సిఎం జగన్‌పై విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పింఛన్లలో కోత పెట్టారన్నారు. అంతేగాకుండా ప్రతి మంగళవారం అప్పుల వారంగా మార్చిన ఘనత చంద్రబాబుదే అని విమర్శించారు. ఎన్నికలకు ముందు సంపద సృష్టిస్తానని చెప్పిన చంద్రబాబు.. అప్పులు సృష్టిస్తూ అన్నివర్గాలను మోసం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్భాటంగా మద్దతు ధర ప్రకటించినా క్షేత్రస్థాయిలో రైతులకు ఎలాంటి ప్రయోజనం కలగడం లేదన్నారు. పంట అంతా దళారుల పాలవుతోందన్నారు. క్షేత్రస్థాయిలో రైతాంగం పడుతున్న కష్టాలు ఎమ్మెల్యేల నుంచి ముఖ్యమంత్రి వరకూ కన్పించడం లేదా? అని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఖర్చు చేశాం.. ఇప్పుడు సంపాదించుకుంటాం అనే రీతిలో ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్య కూడా ఎదురవుతోందన్నారు. అలవికాని హామీలతో అన్ని వర్గాలను మోసం చేసినట్టే మందుబాబును కూడా మోసం చేశారన్నారు. రైతులు గిట్టుబాటు ధర లేదు గానీ, మద్యం అమ్ముకునే వాళ్లకు మాత్రం కమీషన్లు పెంచుతున్నారని విమర్శించారు. ఇదే సమయంలో మద్యం ధరలను కూడా పెంచారన్నారు. మరోవైపు ఎక్కడ చూసినా బెల్ట్ షాపులు వెలుస్తున్నాయన్నారు. ఎపిలో మార్జిన్ పెంచి ముడుపులు తీసుకోవడంతో పాటు కర్ణాటక నుంచి మద్యం తెచ్చి బెల్ట్‌షాపులకు తరలించి అక్రమార్జనకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబును చూసి ఊసరవెల్లి కూడా సిగ్గుతో తలదించుకుంతోందని మండిపడ్డారు. ఈ సమావేశంలో వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లెల వేణు, జెసిఎస్ జిల్లా కన్వీనర్ శివారెడ్డి పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలకు సహకరించాలి : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి అనంతపురం

గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడంలో ఆర్ఎంపిలు, పిఎంపిలు సహకరించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఇబి.దేవి సూచించారు. మంగళవారం కళ్యాణదుర్గం డివిజనల్ పరిధిలోని ఐదు మండలాల్లో ఉన్నట ఆర్ఎంపిలు, పిఎంపిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ ఆర్ఎంపిలు, పిఎంపిలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలన్నారు. పరిధి దాటి వైద్యం చేస్తే సంబంధిత సెంటర్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. రోగులకు ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఉన్నత ప్రభుత్వాసుపత్రులకు పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి యుగంధర్, డెమో త్యాగరాజు, ఆరోగ్య బోధనా అధికారి గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ ఇబి.దేవి

లింగదహాల్ పాఠశాలలో నీటికష్టాలు

ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని లింగదహాల్ జిల్లా పరిషత్ పాఠశాలలో తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. ఈ పాఠశాలలో లింగదహాల్‌తోపాటు కృష్ణాపురం, కొళగానహళ్లి, శ్రీరంగాపురం గ్రామాల నుంచి దాదాపు 350 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. వీరందరూ తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మధ్యాహ్న భోజనం సమయంలో నీటి లేక నానా అవస్థలు పడుతున్నారు. చేసేది లేక అన్నం తిన్న ప్లేట్లు చేత పట్టుకుని వ్యవసాయ బోర్లు, పబ్లిక్ కొళాయిల వద్దకు పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలలు విద్యార్థులకు తాగునీటి కష్టాలు తీర్చాలని విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్లేట్లు చేత పట్టుకుని బయటకు వెళ్తున్న విద్యార్థినులు

సాంబ శివారెడ్డిని కలిసిన సాకే శైలజానాథ్

సాంబశివారెడ్డితో మాట్లాడుతున్న సాకే శైలజానాథ్

శింగనమల : అనంతపురంలోని వైసిపి శింగనమల నియోజకవర్గ నాయకులు ఆలూరు సాంబ శివారెడ్డి స్వగృహంలో మాజీమంత్రి సాకే శైలజానాథ్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. శైలజానాథ్ కొద్దిరోజుల క్రితం వైసిపిలో చేరిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో శైలజానాథ్ జిల్లాకు వచ్చిన సందర్భంగా సాంబశివారెడ్డిని కలిశారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని రాజకీయాలపై చర్చించారు. కలిసికట్టుగా పని చేసి అభివృద్ధికి కృషి చేద్దామని సాంబశివారెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బిసి వసతిగృహం తనిఖీ

ప్రజాశక్తి-నార్పల

సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

మండల కేంద్రంలోని బిసి బాలికల వసతి గృహాన్ని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు ఇందులో భాగంగా హాస్టల్లో వసతులు ఎలా ఉన్నాయి.. భోజనం ఎలా ఉంది.. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నా.. లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా హాస్టల్లో ఎంతమంది విద్యార్థులు ఉన్నారు.. సిబ్బంది వివరాలను హాస్టల్ వార్డెన్‌తో ఆరాతీశారు. తర్వాత హాస్టల్లోని వంటశాల, డైనింగ్ రూమ్‌ను పరిశీలించారు. తర్వాత విద్యార్థులు ఉండే గదులను పరిశీలించి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వసతిగృహం గ్రామానికి దూరంగా ఉన్న నేపథ్యంలో ఎప్పటికప్పుడు విద్యార్థులను గమనిస్తూ ఉండాలన్నారు. ఎలాంటి సమస్య వచ్చిన తనతోపాటు ఉన్నతాధికారులకు తెలిజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆకుల ఆంజనేయులు, ఆలం నాగార్జున, ఆకుల విజయకుమార్ (బాబు), సాయినాథ్, నాగభూషణ, వీఆర్వో శివరాం, సాలెహా, వేణుగోపాల్, ప్రదీప్‌కుమార్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

కొనసాగుతున్న కార్మికుల నిరసనలు

నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి-తాడిపత్రి

ఇద్దరు ఇంజినీరింగ్ కార్మికులపై కమిషనర్ కక్షసాధింపు చర్యలను నిరసిస్తూ కార్మికులు, సిఐటియు నాయకులు చేపట్టిన నిరసనలు మంగళవారం కూడా కొనసాగాయి. ఇందులో భాగంగా 10వరోజు ప్లే కార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులు మాట్లాడుతూ కార్మికులందరినీ రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చి.. ఇప్పుడేమో కార్మికులను రెగ్యులర్ చేయకుండా ఆప్కాస్ విధానాన్ని రద్దు చేయాలని చూస్తోందన్నారు. ముఖ్యంగా తాడిపత్రిలో ఎక్కడా లేనివిధంగా కమిషనర్ ఇద్దరు కార్మికులపై కక్షపూరిత ధోరణితో వ్యవహరిస్తున్నారన్నారు. వెంటనే కార్మికులు రామాంజనేయులు, జుబేర్‌పై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల్లోని కార్మికులతో చలో తాడిపత్రి కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఉమాగౌడ్, మున్సిపల్ ఇంజనీరింగ్ పాల్గొన్నారు.

జెఇఇ మెయిన్స్‌లో విద్యార్థుల సత్తా

విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

ప్రజాశక్తి-అనంతపురం

జెఇఇ మెయిన్స్ సెషన్ వన్‌లో ఫలితాల్లో అనంత నారాయణ కళాశాల విద్యార్థులు అఖిల భారత స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ చాటి రాష్ట్రంలోనే అత్యుత్తమ విద్యార్థులుగా చరిత్ర సృష్టించారు. భూపతి నితిన్ అగ్నిహోత్రి 300 మార్కులకు 290 మార్కులు సాధించాడు. అలాగే మహమ్మద్ అసిఫ్ 99.48, భావన 99.43, విశాల్ 99.36 శాతం సాధించి అత్యుత్తమ ప్రతిభను చాటారు. 99శాతంపైన నలుగురు విద్యార్థులు, 98శాతంపైన ఏడుగురు, 97శాతంపైన 12, 94శాతంపైన 18 మంది అఖిల భారత స్థాయిలో ఉత్తమ ప్రతిభను చాటారు. ఇంతటి ప్రతిభను చాటిన విద్యార్థిని విద్యార్థులను, తల్లిదండ్రులను, బోధన చేసిన సిబ్బందికి అనంతపురం కోర్ డీన్ బికెబద్రీనాథ్, డీజీఎం ఎస్ వెంకటరామిరెడ్డి, ప్రిన్సిపాల్ రవిశంకర్ రెడ్డి, ఓబన్న గౌడ్, డి.శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు శిఖామణి, శైలజ, హిమబిందు, శ్రీధర్ బాబు, ఏజీఎంలు చంద్రశేఖర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, కేశవరెడ్డి అభినందనలు తెలిపారు.

'ర్యాపిడో'పై చర్యలు తీసుకోవాలి : సిఐటియు

ఆర్‌టిఒకు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆటో కార్మికుల కడుపు కొడుతున్న రాపిడోపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం అనంతపురం ఉప రవాణా కమిషనర్ కార్యాలయంలో ఆర్‌టిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాపిడో సంస్థ చేస్తున్న దోపిడీని అరికట్టడానికి చర్యలు చేపట్టాలన్నారు. ర్యాపిడో వల్ల అనేకమంది ఆటో కార్మికులు ఉపాధి కోల్పోతున్నారన్నారు. కావున వెంటనే చర్యలు తీసుకుని ఆటో కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ, భగత్‌సింగ్ ఆటో డ్రైవర్స్ యూనియన్ నగర కార్యదర్శి ఎన్‌టిఆర్ శ్రీనివాసులు, రామలింగారెడ్డి, ఉస్మాన్, జెఎన్‌టియు రామకృష్ణ, నందమూరి శ్రీనివాసులు, కల్లూరి బాషా, తదితరులు పాల్గొన్నారు.

'గుడ్‌టచ్..బ్యాడ్‌టచ్‌పై' అవగాహన

విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నబిరసూల్

ప్రజాశక్తి-బొమ్మనహాల్

గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై మంగళవారం మండలంలోని కస్తూరిబా గురుకుల పాఠశాలలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నబిరసూల్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకుని మీ భవిష్యత్తును మీరే చక్కదిద్దుకోవాలన్నారు. ఇకపోతే రోడ్డు ప్రమాదాలపై అవగాహన పెంచుకుని మీ ఇళ్లలో చెప్పాలన్నారు. ద్విచక్ర వాహనాల్లో ప్రయాణం చేసేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో కెజిబివి నిర్వాహకురాలు కమలమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుట్లూరు : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటనరసింహ సైబర్ మోసాలు, భద్రత, పోక్సో చట్టం, ఈవ్‌టీజింగ్ తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ రాజశేఖర్, కానిస్టేబుల్ రమణ, ఎస్ఒ మాధవి, స్కూల్ టీచర్లు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరులో మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటనరసింహ

రథోత్సవానికి డ్రోన్లతో నిఘా : సిఐ

విలేకరులతో మాట్లాడుతున్న సిఐ కరుణాకర్

బుక్కరాయసముద్రం : మండల కేంద్రంలో వెలసిన కొండమీదరాయుని రథోత్సవాన్ని పురస్కరించుకుని డ్రోన్ల ద్వారా నిఘా ఉంచనున్నట్లు సిఐ కరుణాకర్ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేడు జరగనున్న కొండమీద రాయుని రథోత్సవాన్ని పురస్కరించుకుని పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ముగ్గురు సిఐలు,14 ఎస్ఐలు, 150 మంది పోలీసు, స్పెషల్ పార్టీ బలగాలతో బందోబస్తు ఏర్పటు చేసినట్లు తెలిపారు. అంతేగాకుండా నిరంతరం డ్రోన్లతో నిఘా ఉంచున్నట్లు తెలిపారు. అలాగే భారీ వాహనాలను దారి మళ్లిస్తామన్నారు. ముఖ్యంగా భక్తులు తమ చిన్నపిల్లలు, విలువైన ఆభరణాలు, వస్తువులను జాగ్రత్తగా చూసుకోవాలని కోరారు.

'పది'లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

ఉరవకొండ : 10వ తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని సర్పంచు మల్లెల జగదీష్, మండల విద్యాశాఖ అధికారి తిమ్మప్ప సూచించారు. మంగళవారం వజ్రకరూరు మండల పరిధిలోని చాబాల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రూపొందించిన మాధురి ప్రశ్నపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేంద్రప్ప, ఉపాధ్యాయులు కరణం శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, హ్యూమన్ రైట్స్ ప్రతినిధులు లాలుసాహెబ్, దాదాహనీఫ్, ఎస్ఎంసి సభ్యులు లేపాక్షి పాల్గొన్నారు.

అంగన్వాడీ సెంటర్లను సక్రమంగా నిర్వహించాలి

అంగన్వాడీ సెంటర్లను సక్రమంగా నిర్వహించాలని సర్పంచు మల్లెల జగదీష్ సూచించారు.వంగళవారం వజ్రకరూరు మండల పరిధిలోని చాబాల గ్రామంలోని 3 అంగన్వాడీ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా స్ట్రోర్టిఫైక్స్ రైస్, కంది పప్పు, మంచి నూనె, పాలు, గుడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ నరేష్, అంగన్వాడీ కార్యకర్తలు శశికళ, సోమేశ్వరి, చంద్రమణి, తదితరులు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రి వద్ద అన్నదానం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు 'పుట్టినిల్లు' ఆశ్రమం ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని పెద్దాసుపత్రి వద్ద అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నిర్మలమురళి మాట్లాడుతూ ట్రస్టు సభ్యులు హరికృష్ణ ప్రసాద్ కుమారుడు ప్రణవ్ సాయికృష్ణ పుట్టిన రోజు, మరో సభ్యులు చింతపంటి జనార్దన్‌రెడ్డి కుమార్తె సాయి వర్షిణి పుట్టినరోజు సందర్భంగా అన్నదానానికి సహకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు డి.తేజస్‌రెడ్డి, సుబ్రమణ్యం, నబిరసూల్, ఓబుళపతి, కిష్టప్ప, మణిదీప్, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు రక్త పరీక్షలు

రాప్తాడు : ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో డాక్టర్ శివకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా సుమారు 70మందికి బిపి, షుగర్, రక్త పరీక్షలు చేశారు. ఈ కార్యమంలో సిహెచ్ఒ శివప్రసాద్, సూపర్‌వైజర్ అరుణ, నరసింహ, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీధర్‌బాబు, ఫార్మసీ ఆఫీసర్ మూర్తి, ఎంఎల్‌హెచ్‌పిఎస్, ఎంపిహెచ్ఎస్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల బారిన పడొద్దు

అడిషనల్ ఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి

మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి

ప్రజాశక్తి-గుత్తి

విద్యార్థులు ప్రస్తుత సమాజంలో అప్రమత్తంగా ఉండాలని సైబర్ నేరాల బారిన పడరాదని అడిషనల్ ఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి సూచించారు. మంగళవారం గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సేఫర్ ఇంటర్నెట్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్నెట్ మొబైల్ డేటా వినియోగంతో దేశంలో ఆన్ లైన్ మోసాలు పెరిగిపోయాయని చెప్పారు. సైబర్ నేరగాళ్లు వివిధ పేర్లతో మభ్యపెట్టి అమాయకులను వంచించి కోట్లాది రూపాయలను దోచుకుంటున్నారని అన్నారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో భయపట్టి నగదును దోచేస్తున్నారని అన్నారు. సైబర్ నేరాలకు గురైన బాధితులు డబ్బుతో పాటు ప్రాణాలు కూడా పోగొట్టుకున్నారని చెప్పారు. అనుమానాస్పద ఫోన్లు, మెసేజ్లు వస్తే పోలీసులను సంప్రదించాలన్నారు. సైబర్ మోసానికి గురైన వారు పోలీసులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో పెద్దవడుగూరు సిఐ రామసుబ్బయ్య, ఎస్సై ఆంజనేయులు, గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఎండి రఘునాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుధాకర్, సైబర్ సెక్యూరిటీ విభాగాధిపతి మోహన్ దాస్, అధ్యాపకురాలు కీర్తన తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ సాగులో జిప్సంతో ఉపయోగం

మండల వ్యవసాయ అధికారిణి జె.శశికళ

ప్రజాశక్తి-అనంతపురం

రబీ సీజన్‌లో వేరుశనగ పంట సాగు చేసిన రైతులు 60రోజుల్లో ఎకరాకు 200 కిలోల చొప్పున జిప్సం వేసుకోవాలని అనంతపురం రూరల్ మండల వ్యవసాయ అధికారిణి జె.శశికళ సూచించారు. పోలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలం పరిధిలోని కందుకూరు, జంగాలపల్లి గ్రామ సచివాలయం పరిధిలోని రైతులకు సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిప్సం వేసుకోవడం ద్వారా కాయ సైజు పెరగడంతోపాటు నూనె శాతం, దిగుబడి పెరుగుతుందన్నారు. కావున రైతులు తప్పకుండా జిప్సం వేసుకోవాలన్నారు. ముందుగా పంటలకు జింక్ సల్ఫేట్ 25 కిలోలు హెక్టరుకు పైపాటిగా వేసుకోవాలన్నారు. వీటితోపాటు అనేక సలహాలు, సూచనలు అందజేశారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి అలేఖ్య, రైతు సేవా కేంద్రం సహాయకులు పద్మావతి, నవనీత, గ్రామ జెడ్‌బిఎన్ఎఫ్ స్టాఫ్ ఓబుళపతి, చంద్రాయుడు, ప్రియాంక, సంజీవ్, రైతులు పాల్గొన్నారు.

రైతులకు ఐడి నెంబర్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు పట్టాదారు పాసు పుస్తకం కలిగిన ప్రతి రైతూ కొత్త ఐడి నెంబర్‌ను కలిగి ఉండాలని వ్యవసాయ అధికారిణి జె.శశికళ సూచించారు. ఈ ఐడి నెంబర్ దార్వానే పంట నమోదు, పిఎం కిసాన్, ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా, రాయితీ పనిముట్లు, రాయితీ విత్తనం లబ్ధి సాధ్యమన్నారు. కావున ప్రతి రైతు తప్పనిసరిగా మీ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, సెల్ నెంబర్‌ను మీ పరిధిలోని రైతుసేవా కేంద్రాలకు తీసుకెళ్లి రిజిస్ట్రర్ చేసుకోవాలన్నారు.

పాఠశాల తనిఖీ

మధ్యాహ్న భోజనం తయారీని పరిశీలిస్తున్న డిప్యూటీ డిఇఒ శ్రీదేవి

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని మోడల్ స్కూల్‌ను విద్యాశాఖ డిప్యూటీ డిఇఒ శ్రీదేవి మంగళవారం ఆకస్మింగా తనిఖీ చేశారు. పాఠశాల యాజమాన్యంపై ఫిర్యాదులు అందిన నేపథ్యంలో డిఇఒ ఆదేశాల మేరకు పాఠశాలకు చేరుకుని విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా మధ్యాహ్న భోజన పథకం అమలు, హాస్టల్లో వసతులపై విద్యార్థులు, సిబ్బంది, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఉన్నతమైన విద్యతోపాటు నాణ్యమైన భోజనం సౌకర్యాలు కల్పించాలని సూచించారు. లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

రాయదుర్గం మోడల్ స్కూల్‌లో విద్యార్థుల సమస్యలను తక్షణమే తీర్చాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ కోరారు. ఈమేరకు డిప్యూటీ డిఇఒకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి, ఆరోపణలు ఎదుర్కొంటున్న టీచర్లపై తక్షణమే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. కొన్ని నెలలుగా నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) కోచింగ్ ఇస్తూ రూ.1500 నుంచి రూ.3వేల వరకూ విద్యార్థులతో డబ్బులు వసూలు చేశారన్నారు. దీనికితోడు విద్యార్థులకు నాణ్యత లేని భోజనాలు పెడుతున్నారన్నారు. విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 వెంకటరమేష్, పాఠశాల ప్రిన్సిపాల్ సిబ్బంది పాల్గొన్నారు.

రంగనాథస్వామి ఆలయ అభివృద్ధికి కృషి

విలేకరులతో మాట్లాడుతున్న ఆలయ అభివృద్ధికి కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని తొండపాడు గ్రామంలో వెలిసిన బొలికొండ రంగనాథ స్వామి, మాణిక్య రంగనాథ స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఆలయ అభివృద్ధి కమిటీ ధర్మకర్త మాకం శ్రీకాంత్, కార్యదర్శి అశ్వర్థ రంగయ్య, కన్స్ట్రక్షన్ కార్యదర్శి రామరంగయ్య అన్నారు. మంగళవారం శ్రీరంగ కళ్యాణమండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం ఆలయం చుట్టూ షెడ్డు, స్నానం గదులు, మరుగుదొడ్లను నిర్మించడంతోపాటు ప్రహరీ, పూలతోట, తులసీవనం ఏర్పాటు చేశామన్నారు. కొండపై ఉన్న రంగనాథ స్వామి పుట్టుశిల వరకూ సిసి రహదారి, మెటికలు, ప్రహరీ నిర్మించామన్నారు. సత్రం ఆధునీకరణ, పెద్ద రేకుల షెడ్డు ఏర్పాటు చేశామన్నారు. కొండపైకి తాగునీటిని సరఫరా చేస్తున్నామన్నారు. అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించిన టిడిపి మండల ఇన్చార్జి గుమ్మనూరు నారాయణ రెండు ప్రాంతాల్లో షెడ్ల నిర్మాణానికి సూచనలు ఇచ్చారన్నారు. కొండ రహదారికి ముఖద్వారం నిర్మించడానికి సంకల్పించామని అందుకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ సహకారం లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ కోశాధికారి ముత్యాల వెంకట రంగయ్య, సభ్యులు ముత్యాల రంగస్వామి, రామచంద్రయ్య, కె.సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

నేడు రంగనాథుని రథోత్సవం

మండలంలోని తొండపాడు గ్రామంలో వెలిసిన బొలికొండ రంగనాథ స్వామి రథోత్సవం బుధవారం వైభవంగా జరగనుంది. తెల్లవారుజామున స్వామి శ్రీదేవి, భూదేవి కళ్యాణాన్ని ప్రధాన అర్చకులు అన్నదానం ఆదిశేషయ్య, అన్నదానం రాఘవేంద్రాచారి, చెరుకూరి రవికుమార్ నిర్వహించనున్నారు. మధ్యాహ్నం ప్రత్యేకంగా అలంకరించిన రథంపై స్వామి ఉత్సవ విగ్రహాలను మంచి ఊరేగిస్తారు. రథోత్సవానికి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ రానున్నట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశామని ప్రత్యేక అధికారి కె.ఆదిశేష నాయుడు, ఆలయ కార్య నిర్వహణ అధికారి సి. రామాంజనేయులు తెలిపారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

గుత్తి : మండలంలోని తురకపల్లి గ్రామంలో జరగనున్న బాల్య వివాహాన్ని ఐసిడీఎస్ అధికారులు అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలికను మరో పదిరోజుల్లో సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో వివాహం చేసేందుకు తల్లిదండ్రులు నిశ్చయించారు. ఈవిషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన గుర్తు తెలియని వ్యక్తులు 1098కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన ఐసిడీఎస్ ఇన్చార్జి సీడీపీఓ అగిశం నాగమణి, సూపర్వైజర్లు నాగేశ్వరి, గౌరిలు మంగళవారం గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. మైనర్ బాలిక తల్లిండ్రులు, బంధువులను సచివాలయం వద్దకు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం వారిని గుత్తి తహశీల్దార్ డి.ఓబులేసు, పోలీసుల ఎదుట హాజరు పరిచారు. మైనర్ బాలికలకు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. బాల్య వివాహాల వలన జరిగే అనర్థాలను వివరించారు.

ప్రాంగణ నియామకాలు

అనంతపురం : స్థానిక రుద్రంపేటలో ఉన్న బాలాజీ ఎంబిఎ కళాశాలలో మంగళవారం డీమార్ట్, హైదరాబాద్ అనే బహుళ జాతీయ కంపెనీ ఆధ్వర్యంలో ప్రాంగణ నియామకాలు నిర్వహించారు. ఇందులో 18 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ హెచ్ఆర్ మేనేజర్ శ్రీనివాసన్, ప్రాంగణ నియమక అధికారి బాబా ఫక్రుద్దీన్, వహీదా, విభాగాధిపతి సునీల్, రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు

పారిశుధ్య పనుల పరిశీలన

డ్రైవర్లతో మాట్లాడుతున్న కమిషనర్ బాలస్వామి

అనంతపురం కార్పొరేషన్ : నగరంలోని సప్తగిరి సర్కిల్, కోవూరునగర్, లక్ష్మీనగర్, బళ్లారి రోడ్డు, కళ్యాణదుర్గం రోడ్డు, జూనియర్ కళాశాల రోడ్డు, తదితర ప్రాంతాల్లో చేపట్టిన పారిశుధ్య పనులను కమిషనర్ బాలస్వామి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ నుంచి వెళ్లే చెత్త తరలింపు వాహనాల డ్రైవర్లతో వాహనాల రిపేర్లు, చెత్త సేకరణ పాయింట్లు, రోజూ చెత్త తరలింపు జరిగే ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. తర్వాత మెడికల్ కాలేజీ రోడ్డులోని క్లాప్ ఆటోలను పరిశీలించారు. తర్వాత నగరంలోని 2వ రోడ్డులో ఉన్న స్టడీ పార్కు, బళ్లారి రోడ్డు చౌరస్తాలో, శ్రీనివాస నగర్ (జూనియర్ కాలేజీ), గుత్తి రోడ్డులో (నీరుగంటి వీధి)లో ఉన్న అన్న క్యాంటీన్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇఇ రాధాకృష్ణ, నగరపాలక సంస్థ ఆరోగ్య అధికారి విష్ణుమూర్తి, డిఇ సుబాష్, నరసింహ, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

12న డ్రిప్, స్ప్రింక్లర్లు పంపిణీ

రాప్తాడు : ఎపిఎంఐపి పథకం ద్వారా అర్హులైన రైతులకు ఈనెల 12న మండల కేంద్రంలో డ్రిప్పులు, స్ప్రింక్లర్లు పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్యే పరిటాల సునీత హాజరుకానున్నారు.

జగన్‌ను కలిసిన సాంబశివారెడ్డి

శింగనమల : మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను మంగళవారం తాడేపల్లి కేంద్ర పార్టీ కార్యాలయంలో నియోకవర్గ నాయకులు ఆలూరు సాంబశివారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ప్రస్తుత రాజకీయ సమస్యలపైనే చర్చించారు. నిత్యం ప్రజల్లో ఉండి పార్టీ బలోపేతం కోసం ముందడుగు వేయాలని జగన్ సూచించినట్లు సాంబశివారెడ్డి తెలిపారు.

'మొరుసు'కు గ్లోబల్ ఎడ్యుకేషనల్ అవార్డు

నార్పల : మండల కేంద్రంలోని సరస్వతి విద్యామందిరం కరస్పాండెంట్ ధర్మవరం జీవానంద, డైరెక్టర్ మొరుసు సంజీవరెడ్డికి ప్రతిష్టాత్మక సిఐటిడి గ్లోబల్ ఎడ్యుకేషనల్, ట్రేడ్ ప్రమోషన్ అవార్డు-2025 దక్కింది. గ్రామీణ విద్యను ప్రోత్సహించడం, అభివృద్ధి చేయడంలో విశిష్ట సేవలకు ఈ గౌరవం దక్కింది.

ఉచిత కంటి వైద్యపరీక్షలు

యాడికి : జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని కమలపాడు గ్రామంలో 48 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో నలుగురిని శస్త్ర చికిత్స అవసరం ఉన్నట్లు గుర్తించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి డివిజన్ జిపిఎంఒ మధుసూదనరాజు, యాడికి పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ పరమేశ్వర్, డిఇఒ ఎ.అనిల్, ఎంపిహెచ్ఎలు మద్దిలేటి, జీనత్, ఆశాకార్యకర్త సి.సావిత్రి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు

యాడికి : తరచూ ప్రమాదాలు జరుగుతున్న మండల కేంద్రంలోని బుగ్గ రోడ్డు వినాయక గుడి వద్ద టిడిపి నాయకులు మంగళవారం స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గొర్తి రుద్రమనాయుడు, నాయకులు దడియాల ఆదినారాయణ, తాంద్ర విక్రమ్, కోడూరు నీలకంఠారెడ్డి, స్టోర్ డీలర్లు మహమ్మద రఫీక్, నరసింహచౌదరి, నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో గ్రామసభలు

యాడికి : మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో సిఐ ఈరన్న సిబ్బందితో కలిసి మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. ఇందులో భాగంగా నిట్టూరు, గుడిపాడు, కుందనకోట కమలపాడు గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభల్లో సిఐ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ప్రశాంత జీవనం గడపాలన్నారు. అలాకాకుండా గొడవలకు పాల్పడితే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా నారసింహుని కళ్యాణం

రాయదుర్గం : మండలంలోని మల్లాపురం గ్రామంలో వెలసిన విప్రమలై లక్ష్మీనరసింహస్వామి కళ్యాణం మంగళవారం కమనీయంగా సాగింది. ఇందులో భాగంగా నాగులకట్ట వద్ద ఏర్పాటుచేసిన కళ్యాణ కట్టపై నరసింహస్వామి లక్ష్మీసమేతంగా కళ్యాణం చేశారు. ఈ సందర్భంగా 5 జంటలకు సామూహిక వివాహం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు బిఎన్.తిప్పేస్వామి, ఉపాధ్యక్షులు ధర్మన్న, కార్యదర్శి గురురాఘవేంద్ర ప్రసాద్, కోశాధికారి ఎస్సారెస్ సత్యనారాయణ, జిఎం నరసింహులు, సభ్యులు గుర్నాథరెడ్డి, రామారెడ్డి, నరసింహులు, తిమ్మారెడ్డి, వెంకట్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీమంత్రి లక్ష్మీదేవమ్మకు నివాళి

కళ్యాణదుర్గం రూరల్ : మాజీమంత్రి లక్ష్మీదేవమ్మ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం కంబదూరు మండల కేంద్రంలోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో లక్ష్మీదేవమ్మ పెద్ద కుమారుడు శ్రీధర్, ఎంపిపి, లక్ష్మీదేవమ్మ తనయుడు రాళ్ల అనంతపురం భీమేష్, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ములకనూరు తిమ్మరాయుడు, చందన శివాజీ, ములకనూరు గోవింద్, డాక్టర్ల విభాగం అధ్యక్షుడు బొమ్మయ్య, కన్వీనర్ గొల్ల కదిరిదేవరపల్లి హనుమంతరాయుడు, టౌన్ కన్వీనర్ వడ్డే వెంకటప్ప, ఆర్టీఐ విభాగం అధ్యక్షుడు కిరణ్, మల్లేష్, శివప్రసాద్, రాళ్లపల్లి గంగాధర్, విల్సన్, రాయుడు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ బీమా తీసుకోండి

కళ్యాణదుర్గం రూరల్ : ప్రతి ఒక్కరూ బీమా చేసుకుంటే కుటుంబానికి భరోసా ఉంటుందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సూచించారు. మంగళవారం పట్టనంలోని కార్యాలయం ప్రజావేదికలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి వచ్చిన రూ.1.43 కోట్ల చెక్కును మృతుడి భార్య అరుణకు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ జనరల్ మేనేజర్ రాఘవేంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతులు గుర్తింపు కార్డులు తీసుకోవాలి

ఉరవకొండ : ప్రభుత్వ పథకాల పొందాలంటే రైతులు తప్పనిసరిగా డిజిటల్ గుర్తింపు కార్డులు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పెన్నయ్య సూచించారు. మంగళవారం విడపనకల్ మండల పరిధిలోని గడేకల్, ఎన్.తిమ్మాపురం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా డిజిటల్ గుర్తింపు కార్డు (రైతు విశిష్ట సంఖ్య కార్డ్) ప్రాముఖ్యతను వివరించారు.

సైబర్ నేరాలపై అవగాహన

అనంతపురం : నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో సైబర్ నేరాలపై ప్రిన్సిపాల్ పద్మశ్రీ అధ్యక్షతన మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక యుగంలో సైబర్ సెక్యూరిటీపై అవగాహన అవసరమన్నారు. కావున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ సైబర్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు. అనంతరం టౌన్ సిఐ శాంతిలాల్ వివిధ రకాల సైబర్ ముప్పు, ఆపదలు, నివారణ చర్యలు, మోసాలు, ఆన్‌లైన్ మోసాలపై క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 300 మందికి పైగా విద్యార్థులు సైబర్ వాలంటీర్స్‌గా సైన్‌అప్ చేశారు.

13న పింఛన్ల పరిశీలన

పుట్లూరు : మండలంలో కంటి చూపు కోసం సదరమ్ క్యాంపులో సర్టిఫికెట్ తీసుకుని పింఛన్ తీసుకుంటున్న 116 మంది పింఛన్లను ఈనె 13వతేదీన అనంతపురంలో తనిఖీ చేయనున్నట్లు ఎంపిడిఒ అలివేలమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పింఛన్లు తీసుకునే లబ్ధిదారులు సంబంధిత సర్టిఫికెట్లను తీసుకుని అనంతపురానికి వెళ్లి పరీక్షించుకోవాలని కోరారు.

'ఉపాధి' పనుల పరిశీలన

ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎపిఒ నరేంద్ర

పుట్లూరు : మండల పరిధిలోని చెర్లోపల్లి, కడవకల్లు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను ఎపిఒ నరేంద్ర మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూలీలు కొలతల ప్రకారం పని చేస్తే కనీసం రూ.250 నుంచి రూ.300 వరకూ కూలి పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిఎ వెంగల్‌రెడ్డి, బిఎఫ్‌టి రామంజులరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

హత్య కేసులో ముగ్గురు అరెస్టు

అనంతపురం క్రైం : అక్రమ సంబంధానికి అడ్డు తగులుతున్నాడని భర్తను కడతేర్చిన వైనం నగరంలో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దేవరకొండ కాశప్ప, భార్య సౌభాగ్య కలిసి స్థానిక కక్కలపల్లి టమోటా మండీలో కూలీలతో మేస్త్రీ పని చేయించి తిరిగి గ్రామానికి వెళ్లేవారు. అయితే రెండు నెలల క్రితం తనపొలం అమ్మగా వచ్చిన డబ్బు తీసుకుని చీరల వ్యాపారం చేయడానికి హైదారాబాద్‌కు వెళ్లి అక్కడనే ఉండిపోయాడు. అతని భార్య సౌభాగ్య రోజూ మాదిరే వచ్చి పనులు చేయించి వెళ్లేది. ఈక్రమంలో 2 నెలల క్రితం వద్ద కర్ణాటక రాష్ట్రం, కోలార్‌కు చెందిన నవాజ్‌బేగ్, గౌస్‌పీర్ సౌభాగ్య దగ్గర పనికి చేరారు. అయితే సౌభాగ్య, నవాజ్‌బేగ్ మధ్య అక్రమ సంబంధం ఏర్పడింది. ఈ విషయం భర్త కాశప్పకు తెలిసింది. ఇలాగే కొనసాగితే ఇద్దరినీ చంపుతానని బెదిరించాడు. ఈక్రమంలో భర్త అడ్డును తొలగించుకుంటే ప్రియుడితోనే ఉండొచ్చని భావించిన సౌభాగ్య ప్రియుడు నవాజ్‌తో కలిసి ఈనెల 1వతేదీ స్థానిక కియా మోటార్స్ ఎదురుగా ఉన్న చింతతోపులోకి కాశప్పను తీసుకెళ్లారు. అక్కడ అతిగా మద్యం తాపి ఖాళీ బీరు బాటిల్, బండరాయితో బాది హత్య చేశారు. అక్కడి నుంచి ఎవరికీ అనుమానం కలగకూడదని సౌభాగ్యే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. ఈనెల 3న ఫిర్యాదు అందుకున్న సిఐ ఎన్.శేఖర్ సిబ్బందితో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి కేసును ఛేదించారు. ఈమేరకు ఆర్డీటీ స్టేడియం వద్ద ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు.

రేషన్ పట్టివేత

అనంతపురం : అనంతపురం ప్రాంతీయ నిఘా, అమలు అధికారి వైబిపిటిఎ ప్రసాద్ ఆదేశాల మేరకు జిల్లాలోని రెండు వేర్వేరు చోట్ల అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు మంగళవారం దాడి చేసి పట్టుకున్నారు. అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లి గ్రామంలో మందల పెద్దన్న ఇంటి వెనుక ఖాళీ ప్రదేశంలో అక్రమంగా నిల్వ ఉంచిన 40 బస్తాలు, నగరంలోని బిందెల కాలనీలో వి.గోవిందుకు చెందిన ఇంటి పక్కన రేకుల షెడ్డులో అక్రమంగా నిల్వ ఉంచిన 30 బస్తాల బియ్యాన్ని పట్టుకున్నట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో అధికారులు ఎస్.జమాల్‌బాషా, యు.సద్గురుడు, జె.వాసుప్రకాష్, డి.విజయలక్ష్మి, ఎం.ఇంతియాజ్ అహమ్మద్, బి.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.